


**ధర్మం తప్పిన వర్ష రుతువు గ్రీష్మాన్ని తలపింపచేస్తోంది. పైన నెత్తి మాడుస్తున్న ఎండ; కింద పాదాలు బొబ్బలెక్కిస్తున్న ఎండ; కళ్లల్లో సూదుల్లా పొడిచి నీళ్లు చిమ్మిస్తున్న ఎండ. గాలిలో తేమ పాల్లెక్కువై ఊపిరి సలపనీయక ఉక్కిరిబిక్కిరిచేస్తున్న ఎండ. ఉక్క, చెమట, జిడ్డు.**

మధ్యాహ్నం రెండు గంటల వేళ పల్లె అంతా మాటు మణిగి వుంది. వీథుల్లో జన సంచారం లేదు. గుడి వీధిలోని బడి పిల్లల గొంతులు మాత్రం ఎక్కాలు వల్లె వేస్తూ ఆ ఊరికున్న నాలుగు వీథుల్నీ పలకరించి వస్తున్నాయి.

కరణం గారి పెరట్లో (ఆయున్నిప్పటికీ అందరూ కరణం గారనే అంటారు) బాదం చెట్టు నాల్గువైపులా కొమ్మల్ని విస్తరించుకుని అటు అవతలి వీథిలోకి, ఇటు ఇవతలి వీథిలోకి నీడని పంచుతోంది. చెట్టు మీద గూళ్లు కట్టుకున్న పక్షులన్నీ ఆహారాన్వేషణలో ఎక్కడికో వెళ్లినట్టున్నాయి. ఆ ఊరి వీథుల్లాగే ఆ చెట్టు కొమ్మలు కూడా ఖాళీగానే వున్నాయి. రెండో కొమ్మ మీది కాకి గూట్లో పిల్లలు మాత్రం అప్పుడే కళ్ళు తెరచినట్టున్నాయి. నిశ్శబ్దంగా కువకువలాడుతున్నాయి.

ఊరికి తూర్పు చివర వున్న పాడుపడిన సత్రంలో పూసలోళ్ల చిన్నిగాడు గంజి తాగడం పూర్తి చేసి ఆఖరి గంజి చుక్కేనైనా గిన్నెలో మిగిలిపోయిందేమోనని నాలుక ఫాడవుగా బైటికి చాపి గిన్నెను నాలుక మీద బోర్లించుకుంటున్నాడు. వాడి బాబు కొత్తగా పెళ్ళాడిన నాలుగో పెళ్లాం మంగి వాడి ఈడుదే, పన్నెండేళ్లు.

"ఓరి సిన్నిగా! గిన్నెలో గెంజి సుక్కల్లేవురా. అదేదో మాంసం కూర లాగా ఇంకా గిన్ని నంటుకున్నా కున్నావేట్రా?" అంది ఫక్కున నవ్వుతూ.

"మాంసం కూరంటే నోరూరతందొరే, రెండు కాకుల్ని కొట్టుకు రాకూడదంట్రా" అంది వాడి రెండో తల్లి. చిన్నిగాడి తల్లి తప్ప మిగిలిన ముగ్గురూ అక్కడే వున్నారు. వాడి తల్లి మాత్రం వాడు పసికందుగా వుండగానే వాణ్ణీ వాడి బాబు మొహాన పడేసి వేరే తండాతో వెళ్లిపోయింది.

చిన్నిగాడు గోడకి తగిలించిన కాటల్‌బారు అందుకుని లేచాడు. వాటమైన రాళ్లేరుకుని మొలగుడ్డలో చుట్టుకున్నాడు. వాడు కాకుల కోసం వీధులన్నీ వెదుకుతూ కరణం గారి బాదం చెట్టు దగ్గరకొచ్చాడు.

ఊరికి పడమటి చివర పాకలో మూడంకె వేసి పడుకున్న మందులోళ్ల మారిగాణ్ణి వాళ్లమ్మ రెండంటించి నిద్ర లేపింది. రాత్రి కూడుకి బియ్యం తను అడుక్కొస్తానని, వాణ్ణి మాత్రం కూరకేనైనా సంపాదించుకు రమ్మంది. నిద్రమత్తు పూర్తిగా వదలని మారిగాడు జోగుకుంటూ కరణంగారి బాదం చెట్టుకి అవతలి వీథిలోకొచ్చాడు. వాడి మొలతాడుకి ఎప్పుడూ కాటల్‌బారు వేళ్లాడుతూనే వుంటుంది. నిక్కరు జేబులో గులకరాళ్ల స్టాకుంటుంది.

ఎప్పుడొచ్చిందో ఏమో తల్లి కాకి నోటి నిండా మెత్తని ఆహారాన్ని తెచ్చి పిల్లలకి తినిపిస్తోంది. ఓర్పుగా వాటికి తినడం నేర్పుతోంది. ఇంకా రెక్కలు కూడా రాని ఆ పిల్లలు దేహాన్ని మించిన తలకాయల్తో ఆ తల్లికెంతో అందంగా కన్పిస్తున్నాయి. వాటిలో కోకిల పిల్లలుండు గాక! ఆ కాకి మాతృమూర్తి. వివక్ష చూపకుండా అన్ని పిల్లలకూ ఆహారం అందేలా చూస్తోంది.

అదే సమయంలో చిన్నిగాడు చెవి వరకూ లాగి గురి చూసి వదలిన రాయి, మారిగాడు ఒక కన్ను మూసుకుని రెండో కంటితో చూస్తూ సాగదీసి విడిచిన రాయి ఒక్కసారిగా ఆ తల్లి రెండు రెక్కల గుండా పొట్టను చీల్చుకుపోయాయి.

మరుక్షణం గిలగిల్లాడుతూ నేల పైన పడింది. బాధతో కొట్టుకుంటున్న ఆ మాతృమూర్తి హృదయం మాత్రం తన పిల్లలు ఆహారం లేక చచ్చిపోతాయేమోనని కన్నీళ్లు కారుస్తోంది.

ఇటునుంచి చిన్నిగాడు, అటునుంచి మారిగాడు గోడ దూకి కరణంగారి పెరట్లోకొచ్చారు. ఒకేసారి ఎగిరి దూకి రక్తం ఓడుతున్న కాకి శరీరాన్ని చెరో రెక్కా అందుకున్నారు. ఇద్దరి చేతుల్లోకి చెరో గుప్పెడు చెంట్రుకలూ ఊడొచ్చి వెల్లకిలా పడ్డారు. లేచి ఒకడినొకడు తినేసేలా చూస్తూ కలియబడ్డారు. చేతుల్తో గుద్దుకున్నారు, గోళ్లతో రక్కుకున్నారు. నోటికొచ్చిన బూతులన్నీ తిట్టుకుంటూ మట్టిలో పొర్లుతున్నారు. చిన్నిగాడు, మారిగాడు పొట్టకోస్తే అక్షరం ముక్క రాని పశుప్రాయులు మరి!

* * * *

అలీన దేశాలకి అధ్యక్షత వహిస్తున్న పవిత్ర భారత దేశంలో ఆ రోజు అసెంబ్లీ హాలు కేకల్తో, తిట్లతో మార్మోగిపోతోంది. బల్లలు విరుగుతున్నాయి, లైట్లు పగులుతున్నాయి. అధికార పక్ష సభ్యుడు చిన్నారావు, ప్రతిపక్ష సభ్యుడు మార్తాండరావు ఇంగ్లీషులో బూతులు తిట్టుకుంటున్నారు.

దేశంలో జరుగుతున్న మారణకాండకి విప్లవం అనే అందమైన పేరు పెట్టి సమర్థించపూనుకున్నాడు చిన్నారావు. లంచాల తతంగాల్ని మసిపూసి మారేడుకాయ చేయచూస్తున్నాడు మార్తాండరావు. ఎదుటివాడి మీద ఎంత బురద చల్లగలిగితే అంత గొప్పవాళ్లుగా చెలామణీ కావచ్చుననుకుంటున్నారిద్దరూ. వీలైతే దేశాన్ని గుటకాయస్వాహా చెయ్యాలనే ఆకాంక్ష ఇద్దరి కళ్ళల్లో.

మూలనున్న గాడ్రెజ్ కుర్చీ ఎగిరొచ్చి చిన్నారావు నెత్తినపడింది. ఈ చివరున్న స్టీలు స్టూలొకటి పైకి లేచి మార్తాండరావు చెంపను తాకింది.

గోడ మీద శాంతి కపోతం గుండెకు గాయమై రక్తం ధారకట్టింది. కాకి పిల్లల్లాంటి అమాయక జనం ఎవరో వచ్చి తమనుద్ధరిస్తారని నోళ్లు తెరుచుకుని ఎదురు చూస్తున్నారు.

అసెంబ్లీలో అగ్ని మండుతూనే వుంది.

చిన్నారావు, మార్తాండరావు కాలేజీ లెవల్లో చదువు వెలగబెట్టిన కా, పురుషులు మరి!